సూర్య www.suryaa.com 19వ వసంతంలోకి.. www.suryaepaper.com


EVENING EDITION

నేటి దినపత్రిక సూర్య www.suryaa.com

4PM www.suryaa.com

శనివారం 24-01-2026

పేజీలు: 02


## అమెరికాలో కాల్పుల కలకలం.. నలుగురు భారత సంతతి వ్యక్తుల హత్య!

అమెరికాలోని జార్జియా రాష్ట్రంలో జరిగిన కాల్పుల ఘటనలో నలుగురు భారత సంతతి వ్యక్తులు మృతి చెందారు. మృతులను మీము డోగ్రా, గౌరవ్ కుమార్, నిధి చందర్, హరీశ్ చందర్‌లుగా పోలీసులు గుర్తించారు. ఈ ఘటనకు సంబంధించి అనుమానితుడైన విజయ్ కుమార్‌ను అరెస్టు చేసినట్లు అధికారులు తెలిపారు. కుటుంబ తగాదాల నేపథ్యంలోనే ఈ హత్యలు జరిగినట్టు ప్రాథమికంగా భావిస్తున్నారు. ఘటనపై అట్లాంటాలోని భారత కాన్సులేట్ జనరల్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ మృతుల కుటుంబాలకు సంతాపం తెలిపింది.

# తులం 2లక్షలు బంగారం?

సామాన్యులకు పసిడి కల నిజంగా కలగానే మిగిలిపోయే పరిస్థితి కనిపిస్తోంది. దేశవ్యాప్తంగా బంగారం, వెండి ధరలు రోజురోజుకూ కొత్త రికార్డులు సృష్టిస్తున్నాయి. ప్రస్తుతం ఉన్న ధరల వేగాన్ని చూస్తే త్వరలోనే తులం బంగారం రూ. 2 లక్షల మార్కును చేరినా ఆశ్చర్యం లేదని మార్కెట్ నిపుణులు అంచనా వేస్తున్నారు. తెలుగు రాష్ట్రాల్లో బంగారం ధరలు ఆకాశాన్ని తాకుతున్నాయి. హైదరాబాద్‌లో జనవరి 24 ఉదయం 8 గంటలకు నమోదైన ధరల ప్రకారం 24 క్యారెట్ల బంగారం ధర రూ. 1.57 లక్షల పైగా కొనసాగుతోంది. బంగారంతో పోటీ పడుతూ వెండి ధర కూడా చరిత్రాత్మక గరిష్ఠ స్థాయికి చేరింది. హైదరాబాద్‌లో కేజీ వెండి ధర రూ. 3.60 లక్షలకు చేరింది. 2025లో బంగారం ధరలు దాదాపు 70 శాతం పెరిగి రికార్డు స్థాయిలను తాకిన తరువాత కూడా ఇంకా పెరిగే అవకాశం ఉందని సామ్‌కో సెక్యూరిటీస్ తెలిపింది. దీర్ఘకాల లక్ష్యంగా ఔన్సుకు 7,040 డాలర్లు అని సంస్థ అంచనా వేసింది. ఇటీవల ధరలు ఒక స్థాయిలో నిలకడగా కదలడం మంచి సంకేతమని బ్రోకరేజీలు భావిస్తున్నాయి. బలమైన టెక్నికల్ పరిస్థితి, సెంట్రల్ బ్యాంకుల కొనుగోళ్లు, మాక్రో ఆర్థిక అనుకూలతలు బంగారం ఎగబాకే దిశకు మద్దతు ఇస్తున్నాయి. అయితే రిస్క్ తీసుకునే ఆసక్తి పెరగడం లేదా యూఎస్ విధానాలు కలిసిరావడం తాత్కాలికంగా ధరలు తగ్గే అవకాశం కలిగించవచ్చని హెచ్చరిస్తున్నారు. ఇవాళ ఔన్సుకు 4,900 డాలర్ల రికార్డు స్థాయిని బంగారం దాటేసింది. 2025లో దాదాపు 70 శాతం పెరుగుదల నమోదు కావడంతో దేశీయ బ్రోకరేజ్ సంస్థ సామ్‌కో సెక్యూరిటీస్ దీర్ఘకాల లక్ష్యాన్ని సుమారు 7,040 డాలర్లుగా ప్రకటించింది. పెద్ద ఎత్తున లాభ అవకాశాలు ఉన్నాయని సూచిస్తోంది. ఈ తాజా గరిష్ఠ స్థాయి బంగారం లోపలి టెక్నికల్ బలం ఎంత బలంగా ఉందో నిరూపించిందని సామ్‌కో సెక్యూరిటీస్ తెలిపింది. దీర్ఘకాలంగా కొనసాగుతున్న ఎగబాకే ధోరణి నిలకడగా ఉంటుందని కూడా స్పష్టం చేసింది.ముందు రోజుల్లో ఇటీవలి వేగమైన ర్యాలీ తరువాత మధ్య మధ్యలో వచ్చే నిలకడ దశలను పెద్ద బుల్ మార్కెట్‌లో సహజ విరామాలుగా చూడాలని సామ్‌కో సెక్యూరిటీస్ రీసెర్చ్ హెడ్ అపూర్వ శెర్ చెప్పారు. ఇవి ట్రెండ్ ముగిసిందని సూచించవని ఆయన అభిప్రాయం. మొత్తం టెక్నికల్ పరిస్థితి, మాక్రో ఆర్థిక నేపథ్యం రాబోయే సంవత్సరాల్లో బంగారం పట్ల సానుకూల దృక్పథానికే మద్దతు ఇస్తున్నాయని తెలిపారు.ఫిబొనాచీ ఎక్స్టెన్షన్ అనాలిసిస్



ఆధారంగా సామ్‌కో తదుపరి ముఖ్య లక్ష్య ప్రాంతాన్ని 7,040 డాలర్ల వద్దగా గుర్తించింది. ముందుకు సాగేకొద్దీ మరింత పెరుగుదల అవకాశం ఉందని ఇది సూచిస్తోంది. బంగారం దీర్ఘకాల పెట్టుబడుల్లో నమ్మకమైన ఆధారంగా కొనసాగుతుందని అపూర్వ శెర్ చెప్పారు. ఇది కేవలం తాత్కాలిక ట్రేడింగ్ అవకాశంగా కాకుండా స్థిరత్వం, డైవర్సిఫికేషన్ లాభాలు అందిస్తుందని ఆయన వ్యాఖ్యానించారు. యూఎస్ డాలర్‌కు డిమాండ్ తగ్గడం, విధానాల సడలింపు వాతావరణం, ద్రవ్యోల్బణం చల్లబడటం, కొనసాగుతున్న భౌగోళిక రాజకీయ సంఘర్షణలు, వాణిజ్య అనిశ్చితి, యూఎస్ ఆర్థిక వ్యవస్థ మందగమనం వంటి పరిస్థితులు కొనసాగితే బంగారం ధరలు ఇంకా పైకి వెళ్లే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. 4,850 నుంచి 4,900 డాలర్ల పైన స్థిరమైన బ్రేకౌట్ వస్తే సమీప కాలంలో 5,000 నుంచి 5,200 డాలర్ల దిశగా మార్గం తెరుచుకుంటుందని అంచనా వేస్తున్నారు. దీనికి సెంట్రల్ బ్యాంక్ కొనుగోళ్లు, సేఫ్ హేవెన్ ప్రవాహాలు, అనుకూల విధాన అంచనాలు మద్దతు ఇస్తాయని ఆయన అన్నారు. గత 12 నెలల్లో బంగారం అసాధారణ ప్రదర్శన ఇచ్చింది.



## శ్రీనగర్‌లో భారీ అగ్ని ప్రమాదం..

జమ్మూ కశ్మీర్ రాజధాని శ్రీనగర్‌లో భారీ అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. దాల్ లేక్ తీరంలో ఉన్న ఓ హోటల్‌లో అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. సమాచారం అందుకున్న వెంటనే ఫైర్ సిబ్బంది, వాటర్ అంబులెన్స్‌లు ఘటనాస్థలికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చే ప్రయత్నం చేస్తున్నారు. అగ్ని ప్రమాదం వల్ల భారీగా ఆస్తినష్టం జరిగినట్లు ప్రాథమిక సమాచారం. ప్రమాదానికి గల కారణాలపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



## ఐ-ప్యాక్‌కు సుప్రీంకోర్టులో ఎదురుదెబ్బ

ఐ-ప్యాక్ అసోసియేట్ జితేంద్ర మెహతా మొబైల్ ఫోన్‌లో డేటాను పరిశీలనకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ కి సుప్రీంకోర్టు అనుమతి ఇచ్చింది. జనవరి 8న దేశవ్యాప్తంగా I-PAC ఆఫీసులో సోదాలు జరిగినప్పుడు.. ఢిల్లీలోని కార్యాలయం ఈ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈడీ ప్రధాన కార్యాలయంలో విచారణకు రావాలంటూ శుక్రవారం మెహతాకు సమన్లు జారీచేశారు. మెహతా తరఫున సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన సీనియర్ న్యాయవాది సీ ఏ సుందరం.. ఆయన గోప్యతకు భంగం కలుగుతుందని, ఫోన్‌లో డేటాను పరిశీలించకుండా ఈడీ నిలువరించాలని కోరారు. దీనిపై సుప్రీంకోర్టు ధర్మాసనం 'మీరెందుకు అంత భయపడుతున్నారు?' అని ప్రశ్నించింది. ఈ కేసులో, సుప్రీంకోర్టు జోక్యం చేసుకుని తన క్లయింట్ ప్రాథమిక హక్కులను కాపాడాలని సుందరం అభ్యర్థించారు. 'ఒక అమాయక పౌరుడిని ఎలా కాపాడాలో మాకు తెలుసు' అని ధర్మాసనం బదులిచ్చింది. దీంతో, కోర్టు ఆయన దోషిగా భావిస్తోందని సుందరం వ్యాఖ్యానించారు. ఐ-ప్యాక్ ఢిల్లీ ఆఫీసులో డిజిటల్ పరికరాలను ఈడీ స్వాధీనం చేసుకున్నప్పటికీ, కోల్‌కతాలో మాత్రం సాధ్యం కాలేదు. పశ్చిమ బెంగాల్ పోలీసులు, ముఖ్యమంత్రి మమతా బెనర్జీ సోదాలను అడ్డుకుని, .కోల్‌కతాలో ఈడీ అధికారులు స్వాధీనం చేసుకున్న పత్రాలు, డిజిటల్ పరికరాలను తమవెంట తీసుకెళ్లారు. మనీలాండరింగ్ కేసుల్లో నిందితుల ఫోన్లు, డిజిటల్ పరికరాలను పరిశీలించకుండా ఈడీపై విధించిన ఆంక్షలకు సంబంధించిన అన్ని కేసులను సుప్రీంకోర్టు ధర్మాసనం ఒకేసారి స్వీకరించి, మంగళవారం విచారణ జరపనుంది. లాటరీ కింగ్ శాంటియాగో మార్టిన్ ఫ్యూచర్ గేమింగ్, న్యూస్‌క్లిక్, ఫౌండేషన్ ఫర్ మీడియా ప్రొఫెషనల్స్, అమెజాన్ సెల్లర్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్, తమిళనాడు ప్రభుత్వానికి సంబంధించిన కేసుల్లో కూడా డిజిటల్ డేటాను ఈడీ యాక్సెస్ చేయకుండా సుప్రీంకోర్టు ఆంక్షలు విధించినట్టు సమాచారం. ఈ కేసుల్లో ప్రస్తుత చట్టాలు సరిపోవని, వ్యక్తిగత పరికరాలను యాక్సెస్ చేయడం ఆర్టికల్ 21 కింద గోప్యతా హక్కుకు, ఆర్టికల్ 20(3) కింద స్వీయ-నేరారోపణకు వ్యతిరేకంగా ఉందని వాదించారు. ఈడీ విచారణ ఎదుర్కొంటున్న నిందితులు.. దర్యాప్తు సంస్థలు డిజిటల్ పరికరాలు తనిఖీలు, స్వాధీనం విషయంలో మార్గదర్శకాలను రూపొందించాలని సుప్రీంకోర్టును కోరారు. ఎందుకంటే.. వాటిల్లో వ్యక్తిగత డేటా కూడా ఉంటుంది.



## మార్ఫింగ్ ఫొటోలతో వివాహితకు వేధింపులు

విశాఖపట్నంలో ఫేస్‌బుక్, వాట్సాప్ చిత్రాలను మార్ఫింగ్ చేసి ఓ వివాహితను వేధిస్తున్న నిందితుడిని సైబర్ క్రైం పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. అప్పుగా తీసుకున్న డబ్బులు తిరిగి ఇవ్వాలని అడగడంతో, వ్యక్తిగత వీడియోలు, మెసేజ్‌లను సామాజిక మాధ్యమాల్లో పెడతానని బెదిరించినట్లు బాధితురాలు ఫిర్యాదు చేశారు. ఎన్‌టీఆర్ జిల్లాకు చెందిన వనరాసి శంకర్‌రావును నిందితుడిగా గుర్తించి పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు.



## కేంద్రం తాత్సారంపై షర్మిల గళం

రాష్ట్ర ప్రయోజనాల విషయంలో కేంద్రంలోని మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న తీరుపై ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (APCC) అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఆంధ్రప్రదేశ్‌కు ఆర్థిక సాయం అందించడంలోనూ, అమరావతిని పూర్తిస్థాయి రాజధానిగా అభివృద్ధి చేయడంలోనూ కేంద్రం కావాలనే జాప్యం చేస్తోందని ఆమె ఆరోపించారు. రాష్ట్రానికి రావాల్సిన నిధుల విషయంలో స్పష్టత లేకపోయినా, కేంద్రం పట్ల మెతక వైఖరి ప్రదర్శించడం సరికాదని ఆమె హితవు పలికారు. ముఖ్యంగా VB-G RAM G బిల్లులోని నిబంధనలపై షర్మిల కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ బిల్లులో ఉన్న 60:40 నిష్పత్తి విధానం వల్ల ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంపై అదనపు ఆర్థిక భారం పడుతుందని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. ఒకవైపు కేంద్రం నుండి ఆశించిన స్థాయిలో సాయం అందడం లేదని చెబుతూనే, మరోవైపు రాష్ట్ర ప్రయోజనాలకు గండికొట్టే ఇటువంటి నిబంధనలు ఉన్న బిల్లులకు కూటమి ప్రభుత్వం ఎలా మద్దతు ఇస్తుందని ఆమె సూటిగా ప్రశ్నించారు. అసలు రాష్ట్రానికి అన్యాయం జరుగుతున్నప్పుడు ప్రధాని మోదీకి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మద్దతు కొనసాగించాల్సిన అవసరం ఏముందని షర్మిల ప్రశ్నించారు. విభజన హామీలు నెరవేర్చడంలోనూ, ప్రత్యేక ప్యాకేజీల విషయంలోనూ కేంద్రం తాత్సారం చేస్తున్నా.. ఇంకా ఎందుకు మద్దతు ఇస్తున్నారో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ఆత్మగౌరవాన్ని పణంగా పెట్టి కేంద్రంతో రాజీ పడకూడదని ఆమె హెచ్చరించారు.

వెంటనే కేంద్ర ప్రభుత్వానికి ఇస్తున్న మద్దతును ఉపసంహరించుకోవాలని, అప్పుడే ఏపీ హక్కుల సాధన సాధ్యమవుతుందని షర్మిల డిమాండ్ చేశారు. కేవలం ప్రకటనలకే పరిమితం కాకుండా, అమరావతి నిర్మాణానికి అవసరమైన నిధులను కేంద్రం నుండి రాబట్టడంలో ప్రభుత్వం విఫలమైందని మండిపడ్డారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రయోజనాల కోసం గట్టిగా పోరాడాలని, లేనిపక్షంలో ప్రజలే తగిన బుద్ధి చెబుతారని ఆమె ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

## మిర్యాలగూడలో ఓట్ల గందరగోళం




మిర్యాలగూడ మున్సిపాలిటీ పరిధిలోని 48 వార్డులలో సుమారు 93 వేల ఓటర్లు ఉన్నారు. త్వరలో జరగనున్న మున్సిపల్ ఎన్నికల కోసం అధికారులు ప్రచురించిన ఓటర్ల జాబితాలో ఓట్ల తరలింపుపై గందరగోళం నెలకొంది. ఓటు బదిలీ చేసుకోకపోయినా, ఓట్లు ఇతర వార్డులకు తరలించారని నాయకులు ఆరోపిస్తున్నారు. ఒక్కో వార్డులో 40 నుంచి 50 మంది ఓట్లు గల్లంతయ్యాయని, గెలుపుపై ఆశలు పెట్టుకున్న అభ్యర్థులు తమ ఓట్లు వేరే వార్డులకు వెళ్లాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాంనగర్, తాళ్లగడ్డ, చైతన్య నగర్ వంటి ప్రాంతాలలో ఓట్ల తరలింపు జరిగినట్లు ప్రజలు వాపోతున్నారు. ఇందిరమ్మ కాలనీలో గతంలో 2600 ఓట్లు ఉండగా, ప్రస్తుతం 3 వేలకు పెరిగాయని, ఇక్కడ కూడా ఇతర వార్డుల నుంచి ఓట్లను చేర్చారని విమర్శలు వస్తున్నాయి.



## హాట్‌గా దిశా పటాని

తెలుగులో ఎంతో మంది ముద్దుగుమ్మలు తమ అందచందాలతో, నటనతో ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. కానీ ఆతర్వాత టాలీవుడ్ కు దూరం అయ్యారు. తెలుగులో కొన్ని సినిమాలే చేసి ఆ తర్వాత బాలీవుడ్ కు చెక్కేసినవారు చాలా మంది ఉన్నారు. కొంతమంది ముద్దుగుమ్మలు ఒకటి రెండు సినిమాలతోనే పరిమితం అవుతున్నారు. ఇప్పుడు ప్రపంచం మొత్తం టాలీవుడ్ వైపే చూస్తుంది. ఎంతో మంది తెలుగులో సినిమాలు చేయడానికి రెడీ అవుతున్నారు. ఇప్పటికే ఇతర భాషల నుంచి వచ్చిన ముద్దుగుమ్మలు తెలుగులో టాప్ హీరోయిన్స్ గా రాణిస్తున్నారు. ముఖ్యంగా కన్నడ నుంచి వచ్చిన ముద్దుగుమ్మలు మన దగ్గర స్టార్ హీరోయిన్స్ అయ్యారు. తెలుగు సినిమాలతోనే విపరీతమైన క్రేజ్ తెచ్చుకున్నారు. అలాగే బాలీవుడ్ నుంచి కూడా చాలా మంది భామలు వచ్చారు. పైన కనిపిస్తున్న హీరోయిన్ కూడా బాలీవుడ్ నుంచి వచ్చిన మన దగ్గర స్టార్ గా మారింది. చేసింది రెండు సినిమాలే కానీ స్టార్ డమ్ సొంతం చేసుకొని ఎంతో మంచి కుర్రాళ్ళ హాట్ ఫేవరేట్ హీరోయిన్ గా మారిపోయింది. చేసిన రెండు సినిమాల్లో ఒకటి డిజాస్టర్ కాగా ఓ సినిమా సంచలన విజయం సాధించింది. కానీ ఈ బ్యూటీకి ఆఫర్స్ మాత్రం లేదు. ఇప్పుడు ఒకొక్క సినిమాకు రూ. 3 కోట్లు వసూల్ చేస్తుంది ఈ చిన్నది.

సూర్య www.suryaa.com EVENING EDITION 4PM

## ఫోన్ ట్యాపింగ్ విచారణ.. ప్రభుత్వంపై కేటీఆర్ నిప్పులు..

# ఇదంతా పొలిటికల్ డ్రామా!

ఫోన్ ట్యాపింగ్ కేసులో భాగంగా సిట్ అధికారుల ఎదుట హాజరైన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, విచారణ అనంతరం కీలక వ్యాఖ్యలు చేశారు. పోలీసుల అడిగిన అన్ని ప్రశ్నలకు తాను సుదీర్ఘంగా, స్పష్టంగా సమాధానాలు ఇచ్చానని, విచారణకు పూర్తిస్థాయిలో సహకరించానని ఆయన వెల్లడించారు. ఈ సందర్భంగా తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, గత రెండేళ్లుగా సాగుతున్న ఈ విచారణ ప్రక్రియలో పారదర్శకత లోపించిందని అసహనం వ్యక్తం చేశారు. విచారణాధికారుల తీరుపై కేటీఆర్ సూటిగా విమర్శలు గుప్పించారు. కేసు ఇంకా దర్యాప్తు దశలో ఉండగానే విచారణకు సంబంధించిన వివరాలను బయటకు ఎందుకు లీక్ చేస్తున్నారని ఆయన అధికారులను నిలదీశారు. ఇలాంటి లీకుల వల్ల రాజకీయ నాయకుల వ్యక్తిత్వ హననం జరుగుతోందని, దీనికి బాధ్యులు ఎవరని ఆయన ప్రశ్నించారు. కేవలం తమ పార్టీ నేతల పరువు తీయడమే లక్ష్యంగా కొందరు పని చేస్తున్నారని ఆయన ఆరోపించారు. రాష్ట్రంలో నెలకొన్న ప్రధాన సమస్యల నుండి ప్రజల దృష్టిని మరల్చడానికే కాంగ్రెస్ ప్రభుత్వం ఈ విధమైన "పొలిటికల్ డ్రామాలు" ఆడుతోందని కేటీఆర్ మండిపడ్డారు. ప్రభుత్వం తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి పాత కేసులను తెరపైకి తెచ్చి రాజకీయం చేస్తోందని ఆయన విమర్శించారు. చట్టంపై తమకు గౌరవం ఉందని, అయితే దర్యాప్తు సంస్థలను రాజకీయ కక్షసాధింపులకు వాడుకోవడం ప్రజాస్వామ్యానికి విఘాతమని ఆయన స్పష్టం చేశారు. ఏదైనా విచారణ నిష్పక్షపాతంగా జరగాలే తప్ప, మీడియా లీకులతో ప్రజల్లో తప్పుడు అభిప్రాయాలు కల్పించకూడదని కేటీఆర్ హితవు పలికారు. రాజకీయంగా ఎదుర్కోలేకనే ఇలాంటి కుట్రలకు తెరలేపుతున్నారని, వాస్తవాలు త్వరలోనే ప్రజల ముందుకు వస్తాయని ఆయన ధీమా వ్యక్తం చేశారు. భవిష్యత్తులో కూడా ఏ విచారణకైనా తాము సిద్ధమని, అయితే అది ధర్మబద్ధంగా ఉండాలని ఆయన తేల్చి చెప్పారు.





## అంకెలు రాయలేదని.. నాలుగున్నరేళ్ల కూతురిని కొట్టి చంపిన తండ్రి!

హర్యానాలోని ఫరీదాబాద్‌లో అత్యంత దారుణమైన ఘటన వెలుగులోకి వచ్చింది. 50 వరకు అంకెలు రాయలేకపోయిందన్న కోపంతో నాలుగున్నరేళ్ల కన్నకూతురిని ఓ తండ్రి అత్యంత కిరాతకంగా కొట్టి చంపాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడైన తండ్రిని అరెస్ట్ చేశారు. పోలీసుల కథనం ప్రకారం... పాపను కొట్టిన తర్వాత, ఆసుపత్రికి తీసుకెళ్లగా అప్పటికే మరణించినట్లు వైద్యులు నిర్ధారించారు. అనంతరం, పనిలో ఉన్న భార్యకు ఫోన్ చేసి, పాప ఆడుకుంటూ మెట్లపై నుంచి పడిపోయి చనిపోయిందని కట్టుకథ చెప్పాడు. అయితే, ఆసుపత్రికి చేరుకున్న తల్లి, పాప శరీరంపై, ముఖంపై గాయాలు, కమిలిన గుర్తులు చూసి అనుమానంతో పోలీసులకు ఫిర్యాదు చేసింది. తల్లి ఫిర్యాదుతో రంగంలోకి దిగిన పోలీసులు, తండ్రి కృష్ణ జైస్వాల్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా నేరాన్ని అంగీకరించాడు.



## ఇంజినీరింగ్ విద్యార్థినిపై అత్యాచారం

విశాఖలోని భీమిలిలో దారుణ ఘటన వెలుగు చూసింది. ఓ ఇంజినీరింగ్ విద్యార్థినిపై తోటి విద్యార్థి అత్యాచారానికి పాల్పడ్డాడు. విశాఖకు చెందిన 24 ఏళ్ల యువకుడు, అనకాపల్లి జిల్లా నక్కపల్లికి చెందిన 20 ఏళ్ల యువతి ఒకే కళాశాలలో చదువుతున్నారు. వీరిద్దరి మధ్య స్నేహం ఏర్పడగా, ఈ నెల 21న భీమిలి బీచ్, తగరపువలస ప్రాంతాలకు వెళ్లారు. అక్కడ యువకుడు తనపై లైంగిక దాడికి పాల్పడ్డాడని బాధితురాలు ఫిర్యాదు చేయడంతో, నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

# బంగ్లా క్రికెట్ బోర్డులో కలకలం




బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు (బీసీబీ) మరోసారి తీవ్ర వివాదాల్లో చిక్కుకుంది. బోర్డు డైరెక్టర్ మొఖ్లేసుర్ రహ్మాన్‌పై వచ్చిన అవినీతి ఆరోపణలపై బీసీబీ అంతర్గత విచారణకు ఆదేశించింది. బంగ్లాదేశ్ ప్రీమియర్ లీగ్ (బీపీఎల్) ప్రస్తుత సీజన్‌లో అవినీతి జరిగిందంటూ ఆరోపణలు రావడంతో ఈ పరిణామం చోటుచేసుకుంది. రియాసద్ అజీమ్ అనే జర్నలిస్ట్ తన ఫేస్‌బుక్ పేజీలో ఈ ఆరోపణలను బయటపెట్టడంతో ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. దీంతో వెంటనే స్పందించిన బీసీబీ, తమ ఇంటెగ్రిటీ యూనిట్‌తో విచారణ ప్రారంభించింది. విచారణ పూర్తయ్యే వరకు మొఖ్లేసుర్ రహ్మాన్ తన ఆడిట్ కమిటీ చైర్మన్ పదవి నుంచి తప్పుకున్నారని బీసీబీ అధికార ప్రతినిధి ధృవీకరించారు. అక్టోబర్‌లో బీసీబీ డైరెక్టర్‌గా ఎన్నికైన రహ్మాన్, చపైనవాబ్‌గంజ్ కౌన్సిలర్‌గా ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఐసీసీ అవినీతి నిరోధక విభాగానికి గతంలో చీఫ్‌గా పనిచేసిన అలెక్స్ మార్షల్ నేతృత్వంలోని బీసీబీ ఇంటెగ్రిటీ యూనిట్ ఈ విచారణను పర్యవేక్షిస్తోంది. గత బీపీఎల్ సీజన్‌కు సంబంధించిన 900 పేజీల అవినీతి నివేదికను కూడా ఇదే విభాగం సమీక్షిస్తుండటం గమనార్హం. ఈ నెలలో వివాదంలో చిక్కుకున్న రెండో బీసీబీ డైరెక్టర్ రహ్మాన్ కావడం బోర్డును మరింత ఇబ్బందుల్లోకి నెట్టింది. కొద్ది రోజుల క్రితం మరో డైరెక్టర్ నజ్ముల్ ఇస్లాం వ్యాఖ్యలకు నిరసనగా బంగ్లా క్రికెటర్లు బీపీఎల్ మ్యాచ్‌లను బహిష్కరించారు. దీంతో అతడిని ఫైనాన్స్ కమిటీ చైర్మన్ పదవి నుంచి తొలగించారు. ఈ వరుస పరిణామాలు బంగ్లాదేశ్ క్రికెట్ పాలనలో తీవ్రమైన ఒత్తిడిని పెంచుతున్నాయి.



## రిజిస్టర్ మ్యారేజ్ తో ఒక్కటైన ఐఏఎస్-ఐపీఎస్ జంట!

ఉన్నత ప్రభుత్వ హోదాల్లో ఉన్నప్పటికీ, ఆడంబరాలకు దూరంగా ఉంటూ ఓ ఐపీఎస్ అధికారిణి, శిక్షణలో ఉన్న ఐఏఎస్ అధికారి నిరాడంబరంగా వివాహం చేసుకుని అందరికీ ఆదర్శంగా నిలిచారు. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలంలోని లింగారెడ్డిగూడెంకు చెందిన ఐపీఎస్ అధికారిణి శేషాద్రిని రెడ్డి, ఏపీలోని కడప జిల్లాకు చెందిన ట్రైనీ ఐఏఎస్ శ్రీకాంత్ రెడ్డి శనివారం చట్టబద్ధంగా ఒక్కటయ్యారు. చౌటుప్పల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో అత్యంత సాదాసీదాగా వీరి వివాహం జరిగింది. కేవలం కుటుంబ సభ్యులు, కొద్దిమంది సన్నిహితుల సమక్షంలో రిజిస్ట్రార్ ఎదుట సంతకాలు చేసి ఈ జంట ఒక్కటయ్యారు. ప్రస్తుతం కుత్బుల్లాపూర్ డీసీపీగా విధులు నిర్వర్తిస్తున్న శేషాద్రిని, ఐఏఎస్ శిక్షణార్థి శ్రీకాంత్ రెడ్డి ఎలాంటి ఆర్భాటాలకు పోకుండా వివాహం చేసుకోవడం విశేషం. లక్షలాది రూపాయలు ఖర్చు చేసి అట్టహాసంగా పెళ్లిళ్లు చేసుకుంటున్న ఈ రోజుల్లో, ఉన్నత స్థాయిలో ఉన్న ఈ జంట తీసుకున్న నిర్ణయంపై సోషల్ మీడియాలో ప్రశంసల వర్షం కురుస్తోంది. హోదా పెరిగినా ఒదిగి ఉండాలనే వీరి తీరు ఎందరికో స్ఫూర్తినిస్తోందని నెటిజన్లు కామెంట్లు చేస్తున్నారు. ఈ వేడుకకు హాజరైన పలువురు ఉన్నతాధికారులు నూతన వధూవరులను ఆశీర్వదించారు.



# హాట్ లుక్‌లో కళ్యాణి

కళ్యాణి ప్రియదర్శన్ సౌత్ ఇండస్ట్రీలో టాప్ హీరోయిన్. 2017 నుండి సినిమాల్లో హీరోయిన్‌గా అరంగేట్రం చేసింది. 2019లో తమిళ సినిమాలో హీరోయిన్‌గా అరంగేట్రం చేసింది. నటుడు శివకార్తికేయన్ సరసన నటించి మెప్పించింది. 2020 లో మలయాళ సినిమాలో నటిగా అడుగుపెట్టిన నటి కళ్యాణి ప్రియదర్శన్ అనేక చిత్రాల్లో నటించింది. ఇప్పుడు ఆమె నటించిన లోకా చాప్టర్ 1 చిత్రం దూసుకుపోతుంది. ఇప్పటివరకు దాదాపు 200 కోట్లకు పైగా వసూల్లు రాబట్టింది.కళ్యాణి ప్రియదర్శన్ కొన్ని సంవత్సరాల క్రితం ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడుతూ, శివకార్తికేయన్ తనతో నటించక ముందే తాను ఆయనకు పెద్ద అభిమానినని అన్నారు. ఈ విషయం చెప్పినప్పుడు అతను నమ్మలేకపోయాడని తెలిపింది.అతను సెట్‌లో ఉన్నప్పుడు మేము నవ్వుకునేవాళ్ళం. అతడి కామెడీ టైమింగ్ అంటే నాకు ఎంతో ఇష్టం అని చెప్పుకొచ్చింది. ప్రస్తుతం కళ్యాణి చేసిన కామెంట్స్ సోషల్ మీడియాలో తెగ వైరలవుతున్నాయి.

## నేను వ్యక్తిగత దూషణలు చేయను... చిల్లర భాషను వాడను

### ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్



తెలంగాణలో ఫోన్ ట్యాపింగ్ కేసు దర్యాప్తు రాజకీయంగా తీవ్ర దుమారం రేపుతోంది. ఈ వ్యవహారంలో సిట్ దర్యాప్తును విమర్శిస్తూ మీడియా సమావేశం నిర్వహించిన 12 గంటల్లోపే తనకు నోటీసులు జారీ చేయడంపై బీఆర్ఎస్ ముఖ్య నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఇది కచ్చితంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వ ప్రతీకార చర్యేనని ఆరోపించారు. ప్రభుత్వ హెచ్చరికలకు, నోటీసులకు భయపడేది లేదని, తన వద్ద ఉన్న ఆధారాలతోనే సిట్‌కు సమాధానం ఇస్తానని శనివారం విడుదల చేసిన ఒక ప్రకటనలో ప్రవీణ్ కుమార్ స్పష్టం చేశారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో తమ పార్టీ సీనియర్ నేతలు కేటీఆర్, హరీశ్ రావులకు సంబంధం లేకున్నా సిట్ వేధిస్తోందని శుక్రవారం మీడియా సమావేశంలో విమర్శించినట్లు ఆయన గుర్తుచేశారు. ఆ ప్రెస్ మీట్ ముగిసిన 12 గంటల్లోపే, శుక్రవారం అర్ధరాత్రి 12 గంటలకు సిట్ పోలీసులు తన ఇంటికి వచ్చి నోటీసులు ఇచ్చారని ప్రవీణ్ కుమార్ తెలిపారు. రెండు రోజుల్లో ఆధారాలతో సమాధానం ఇవ్వాలని, లేకపోతే సివిల్, క్రిమినల్ చర్యలు తప్పవని హెచ్చరించారని పేర్కొన్నారు. ప్రజా సమస్యలపై గొంతెత్తడం ప్రతిపక్ష నేతగా తన హక్కు అని, ఇలాంటి వార్నింగులకు భయపడనని తేల్చిచెప్పారు. సిట్ చీఫ్ సజ్జనార్‌పై తాను వ్యక్తిగత ఆరోపణలు చేయలేదని, ఆయనపై ఏపీలో నమోదైన కేసులపై సిట్ వేయాలని డిమాండ్ చేసినట్లు నోటీసులో పేర్కొనడం వాస్తవ విరుద్ధమని అన్నారు. "నేను వ్యక్తిగత దూషణలు చేయను... చిల్లర భాషను వాడను. 2015లో ఓటుకు నోటు కేసు సమయంలో నాటి టీడీపీ ఎమ్మెల్యే రేవంత్ రెడ్డి కెమెరాకు అడ్డంగా దొరికారు. ఆ తర్వాత ఏపీ నేతల ఫోన్లు ట్యాప్ చేశారని తెలంగాణ ఇంటెలిజెన్స్ అధికారులపై కేసులు నమోదయ్యాయి. ఆ సమయంలో సజ్జనార్ కూడా ఇంటెలిజెన్స్ విభాగంలో అధికారిగా పనిచేశారు. అందుకే, ఇప్పుడు ఆయనే ఈ ట్యాపింగ్ కేసు దర్యాప్తుకు నేతృత్వం వహించడం నైతికంగా సరైంది కాదని మాత్రమే నా అభిప్రాయం చెప్పాను. ఇది రాజ్యాంగం కల్పించిన హక్కు" అని తన వ్యాఖ్యలను ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ సమర్థించుకున్నారు. ప్రభుత్వం తమపై కక్ష సాధిస్తోందని, బీఆర్ఎస్ నేతలపై వ్యక్తిత్వ హననానికి పాల్పడుతున్నా పోలీసులు పట్టించుకోవడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం చేస్తున్న బొగ్గు కుంభకోణం వంటివాటిపై సిట్ ఎందుకు వేయడం లేదని ప్రశ్నించారు. కేవలం ప్రభాకర్ రావు, ఆయన కుటుంబ సభ్యులు, కింది స్థాయి సిబ్బందిని లక్ష్యంగా చేసుకుని దర్యాప్తు చేయడం అన్యాయమని అన్నారు. బీఆర్ఎస్ నేతలకు మాత్రమే ఆగమేఘాల మీద నోటీసులు రావడం, దర్యాప్తు వివరాలు మీడియాకు లీక్ కావడం, కాంగ్రెస్ నేతలు గాంధీభవన్‌లో లైవ్ కామెంటరీలు ఇవ్వడం చూస్తుంటే ఇదంతా రాజకీయ కుట్ర అని స్పష్టమవుతోందని ప్రవీణ్ కుమార్ విమర్శించారు. ప్రభుత్వ అణచివేతకు వ్యతిరేకంగా తమ పోరాటం ఆగదని ఆయన హెచ్చరించారు.